పదిహేనేళ్లయినా పరిస్థితి మారలే.. 2







గ్రామాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## అంకాపూర్‌లో గీతాదీక్ష పరిపూర్ణం



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని అంకాపూర్ వైదిక ధ్యానయోగా ఆశ్రమంలో గీతాదీక్ష పరిపూర్ణమైంది. శ్రీమద్ భగవద్గీతలోని 18 అధ్యాయాల్ని సంపూర్ణంగా పఠనం చేసి గాయత్రి మృత్యుంజయ యజ్ఞాల్ని శుక్రవారం పూర్ణాహుతితో పూర్తిచేశారు. ఈ సందర్భంగా వైదిక ధర్మ ప్రచారకులు శ్రీధరానంద భారతి స్వామి, వేద పునీతానంద భారతి స్వామి అమృత భాషణం చేశారు. భగవద్గీత 18వ అధ్యాయం గీతా ఉపదేశానికి పరమసారంగా నిలిచిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రాథమిక్ కంకణాల రాజేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.



## ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయలేడి మోసం.. కేసు నమోదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉద్యోగాలిప్పిస్తానని ఓ మహిళ నిరుద్యోగులను మోసం చేసింది. ఈ ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన రామావత్ రాజు డిగ్రీ పూర్తిచేశాడు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి జీ శ్రీనివాస్ అనే మిత్రుడు ద్వారా గొబ్బి స్వరూప అనే మహిళ పరిచయమైంది. ఆమె తాను ఆర్అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో పీఏవోగా పని చేస్తున్నట్లు పరిచయం చేసుకుంది. రోడ్లు భవనాల శాఖలోనే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని సదరు మహిళ బాధితుడు రాజు వద్ద నుంచి రూ.4 లక్షల తీసుకుంది. తన మిత్రుడి వద్ద కూడా రూ.7 లక్షలు తీసుకొని ఏడాదిగా ఉద్యోగం ఇప్పిస్తానని మభ్యపెడుతూ వస్తోంది. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తమ డబ్బు తమకివ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఆమె డబ్బులిచ్చేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండంటూ వారినే బెదిరించింది. మోసపోయామని గ్రహించిన బాధితులు రాజు, శ్రీనివాస్‌లు నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మార్చురీ భవనాన్ని పాత స్థలంలోనే నిర్మించాలి



**అక్షరటుడే, బాన్సువాడ :** పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆస్పత్రి కి అనుసంధానంగా నిర్మించనున్న మార్చురీ గదిని గతంలో ఉన్న స్థలంలోనే నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వేరే చోట నిర్మిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతలో మార్చురీ ఉన్నస్థలంలోనే కొత్త భవనం నిర్మించాలని.. ఈ మార్చురీని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల వద్ద నిర్మించడానికి ప్రయత్నిస్తే ఊరుకోమని పేర్కొన్నారు. అనేక మంది విద్యార్థులు భయాందోళనకు గురవడమే కాకుండా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అటువంటి పరిస్థితులు రాకుండా గతంలో ఉన్న స్థలంలోనే మార్చురీ గదిని నిర్మించి, చుట్టూ ఎత్తైన కాంపౌండ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థుల సంరక్షణ కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.





## కోడ్ ముగిసినా ముసుగు తీయలేదేం..

**పంచాయతీ ఎన్నికలు ముగిసిపోయి పాలకవర్గాలు ప్రమాణస్వీకారాలు సైతం చేశాయి. పాలన సైతం సాగిస్తు న్నాయి. ఎన్నికల నిబంధనలు సైతం సడలించారు. కానీ గాంధారి మండలంలో విగ్రహాలకు ముసుగులు మాత్రం తీయలేదు. దీంతో వీటిని చూసిన ప్రజలు మాత్రం అధికారుల అలసత్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.** – అక్షరటుడే, గాంధారి

**ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. కొత్త పాలకవర్గాలు కొలువు దీరాయి. ఎన్నికల సమయంలో గెలుపు కోసం సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు. కొన్ని గ్రామాల్లో సాధారణ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోకుండా డబ్బులు పంచారు. అధికారులు ఎంత కట్టడి చేసినా.. మద్యంతోపాటు నగదు ఏరులై పారింది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పోటీపడి మరీ ఖర్చు చేశారు. అయితే ఇప్పుడు ఖర్చు చేసిన మొత్తాన్ని లెక్కలు చూపాల్సిన సమయం ఆసన్నమైంది. పోటీ చేసిన అభ్యర్థులు 45 రోజుల్లోగా తమ ఖర్చుల వివరాలను సమర్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.** - అక్షరటుడే, ఇందూరు




# లెక్క చెప్పాల్సిందే..

■ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు తెలపాలి ■ 45 రోజుల గడువు ఇచ్చిన ఎన్నికల సంఘం ■ తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

ఉమ్మడి జిల్లాలో 1,077 సర్పంచ్ స్థానాలకు, 9,678 వార్డు స్థానాలకు ఈ నెల 11, 14, 17 వ తేదీల్లో ఎన్నికలను నిర్వహించారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎన్నికలు ముగిసిన తేదీ నుంచి 45 రోజుల్లో ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. దీంతో తొలి విడతలో పోటీ చేసిన అభ్యర్థులు జనవరి 24, రెండో విడత లో పోటీ చేసిన వారు జనవరి 27, మూడో విడతలో పోటీ చేసిన అభ్యర్థులు 30వ తేదీలోపు ఖర్చుల వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఖర్చుల వివరాల నమోదుకు ఎన్నికల సంఘం మండలానికి ఒక సహాయ వ్యయ పరిశీలకుడిని నియమించింది. నివేదికలను ఫిబ్రవరి 15లోగా టీఈ పోల్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవోలకు ఈసీ సూచించింది.

### లెక్కలపై తర్జనభజన

ఎన్నికల నిబంధనల ప్రకారం 5000 లోపు జనాభా ఉన్న పంచాయతీల్లోని సర్పంచ్ అభ్యర్థి గరిష్టంగా రూ.1.50 లక్షలు, వార్డ్ అభ్యర్థి రూ.30 వేల వరకు ఖర్చు చేయాలి. 5వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షలు, వార్డు అభ్యర్థి రూ.50 వేల వరకే ఖర్చు చేయాలని పరిమితి విధించింది. అయితే ఎన్నికల ఖర్చులను నియంత్రించే వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో కొన్ని మేజర్ గ్రామపంచాయతీలో రూ.50 లక్షలకు పైగా కూడా ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. లెక్కలు తప్పితే పదవికే వేటు పడే అవకాశం ఉండటంతో ఖర్చుల వివరాలు తగ్గించి చూపించేందుకు అభ్యర్థులు తర్జనభజన పడుతున్నారు.

### ఓడిన వారు సైతం

గెలిచిన అభ్యర్థులతో పాటు ఓడిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను విధిగా సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. గడువులోగా వివరాలు ఇవ్వకున్నా.. తప్పుడు సమాచారం అందించినా పంచా యతీ చట్టం 2018 లోని సెక్షన్ 23 ప్రకారం గెలిచినవారు తమ పదవిని కోల్పోవాల్సి ఉంటుంది. ఓడిన అభ్యర్థులు తప్పుడు సమాచారం ఇస్తే మరో మూడేళ్లపాటు ఏ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తారు. దీంతో అభ్యర్థులు ఖర్చుల వివరాలను సమర్పించడానికి సిద్ధం అవుతున్నారు.

## వేం నరేందర్‌రెడ్డిని సన్మానించిన మానాల మోహన్‌రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదినాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీలో ప్రథమ స్థానంలో జిల్లా జట్టు



**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల హాకీ పోటీలో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కార్యదర్శి నాగమణి తెలిపారు. ఫైనల్ పోరులో జిల్లా జట్టు మహబూబ్ నగర్ జట్టుపై గెలిచి బంగారు పతకం కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జట్టును, జట్టు మేనేజర్ నగేష్‌ను క్రీడాభిమానులు అభినందించారు.

## ఆడపిల్ల పుడితే రూ.5 వేలు..



**అక్షరటుడే, కామారెడ్డి :** ఆడపిల్ల పుడితే భారం అనుకుని కడుపులోనే గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారు. అలాంటి ఈ రోజుల్లో ఆడపిల్ల పుడితే రూ.5వేలు ఇస్తానని పంచాయతీ ఎన్నికల్లో ఓ సర్పంచ్ అభ్యర్థి మాటిచ్చాడు. తనను గెలిపిస్తే ఆడపిల్ల పుడితే రూ.5 వేలు ఇస్తానని తాడ్వాయి మండలంలోని కాళోజీవాడి గ్రామలో బద్దం చంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఈమేరకు ఎన్నికల్లో చంద్రారెడ్డి విజయం సాధించాడు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవనిద్దాం అనే నినాదంతో ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ.5 వేలను సుకన్య సమృద్ధి యోజన పథకంలో వేస్తానని తెలిపారు. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వారు మృతి చెందితే వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఆర్థిక సహాయం అందజేస్తానని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న యువకుల కోసం ప్రత్యేక లైబ్రరీ ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. తన సొంతగా రూ.లక్ష డిపాజిట్ చేయడంతో పాటు ప్రతినెలా వచ్చే సర్పంచ్ గౌరవ వేతనం కూడా గ్రామ ప్రజలకు ఖర్చు చేస్తామని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తన సొంత డబ్బులతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు. త్వరలోనే ఈ హామీలన్నీ కార్యరూపం దాలుస్తాయని, మండలంలోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని పేర్కొన్నారు.

## జిల్లా ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నేతల ఎన్నిక




**అక్షరటుడే, ముప్కాల్:** జిల్లా ఆదివాసీ నాయకుపోడ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పుట్ట శివశంకర్ ఎన్నికయ్యారు. ఆయన ఎంపికపై పలువురు నాయక్‌పోడ్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడిగా బండారి భోజన్న ఎన్నికయ్యారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పేదలకు ఉపశమనం



**అక్షరటుడే, భీమ్‌గల్ :** సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పేదలకు ఉపశమనం కలుగుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని మెండోరా గ్రామంలో చెక్కులు మంజూరైన వారికి శుక్రవారం ఉపసర్పంచ్ కుంట రమేష్, నాయకులు అందజేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజేశ్వర్ గౌడ్, పల్లె శేఖర్, షఫీ, సంతోష్, డాక్టర్ భూమేష్, బాలరాజు పాల్గొన్నారు.



## పర్వదినాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి

**అక్షరటుడే, ఇందూరు:** పవిత్ర పర్వదినాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని మౌని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్కంద షష్టి రోజు కల్యాణంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆరోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆలయ కమిటీ సభ్యులు మరిన్ని కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**అక్షరటుడే, కామారెడ్డి:** కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని సీఐటీయూ, రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నోటికి నల్ల గుడ్డలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు 29 చట్టాలు ఉంటే వాటిని కేంద్ర ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకు వచ్చిందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కంపెనీ యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు రూపొందిస్తుందని ఆరోపించారు. ఇది కార్మికులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలు తీసుకొస్తే రైతులు పెద్దఎత్తున పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి చట్టాలు రద్దయ్యేలా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పద్ధతిని మార్చుకోకపోతే కార్మికులను, రైతులను ఏకం చేసి మరో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, అరుణ్ కుమార్, రైతుసంఘం నాయకుడు వెంకట్ గౌడ్, మోహన్, దశరథ్, రాజు, శీను పాల్గొన్నారు.





## ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ల ప్రమాణ స్వీకారం

**అక్షరటుడే, గాంధారి:** గండివేట్ గ్రామ ఉప సర్పంచ్‌గా పెద్ద కాశీరాం, వార్డు మెంబర్లు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సంజీవ్ వారితో ప్రమాణం చేయించారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన అనంతరం సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఆ తేదీన గండివేట్ గ్రామ సర్పంచ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. కానీ ఆరోజు కాంగ్రెస్ మద్దతు దారుడైన సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులతో కలిసి బాధ్యతలు తీసుకున్నారు. సర్పంచ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్ మద్దతుదారులైన ఉపసర్పంచ్, వార్డు మెంబర్ల ఫొటోలు లేకపోవడంతో వారు కినుకు వహించినట్లు తెలిసింది. ఆ రోజు వారు ప్రమాణ స్వీకారం చేయలేదు. అనంతరం శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సంజీవ్ సమక్షంలో వీరంతా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ తానాజీ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివాజీ, నాయకులు ఫరూక్, రెడ్డి రాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్య వంతులైన ప్రతిఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు..రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కార్యదర్శి అరుణ్ కుమార్, లయన్స్ ఆరోగ్య విభాగం జిల్లా ఛైర్మన్ కరిపె రవీందర్, ఇందూర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, రాఘవేందర్, పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప సన్నిధానానికి విరాళం

**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ మండలంలోని లక్కోరా గ్రామంలో అయ్యప్ప స్వాములు సన్నిధాన నిర్మాణానికి అవసరమైన నిధులను సమీకరణ లో భాగంగా శుక్రవారం పబ్బతి నాగేశ్వరరావు రూ. 10,116 విరాళంగా స్వాములకు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప గురు స్వామి మాదాస్తు శ్రీనివాస్ మాట్లాడుతూ... లక్కోరా లో ప్రతి సంవత్సరం 20 నుంచి 30 మంది అయ్యప్ప మాల ధరించడం జరుగుతుందని అయ్యప్ప సన్నిధానం నిర్మించాలని సంకల్పించామని దాతలు ముందుకు వచ్చి ఇందులో భాగస్వాములు కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గురు స్వామి బ్రహ్మానందం,అడవుల శ్రీనివాస్, అరుణ్, చిన్నారెడ్డి, శ్రీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**అక్షరటుడే, బాల్కొండ:** కిసాన్‌నగర్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ రామరాజు గౌడ్ తెలిపారు. గ్రామంలోని 3,4,10వ వార్డులను శుక్రవారం ఆయన సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలో తాగు నీటితో పాటు డ్రెనేజీ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామినాథ్, వార్డు సభ్యుడు నవీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలు మానుకోవాలి



**అక్షరటుడే, బాల్కొండ:** ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాలని బాల్కొండ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామాల్లో కక్షలు పెరిగి అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. రాజకీయాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## ముదిరాజ్ సర్పంచుల సన్మాన సభ పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, ఇందల్వాయి:** ముదిరాజ్ సర్పంచుల సన్మాన కార్యక్రమం పోస్టర్లను డిచ్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలిచిన ముదిరాజ్‌లను ఆత్మీయంగా సన్మానించుకుంటామని వారు పేర్కొన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మన మహాసభ జిల్లా అధ్యక్షుడు యాసాద నర్సింగ్, జిల్లా ఉపాధ్యక్షులు గన్నారం రాజేందర్, నిజామాబాద్ పట్టణ అధ్యక్షుడు శీలం శ్రీనివాస్, జిల్లా విద్య,క్రీడా విభాగం కార్యదర్శి మద్దుల మురళి, డిచ్‌పల్లి సర్పంచ్ యాదగిరి, గుండారం సర్పంచ్ గంగాధర్,డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ మాజీ ఛైర్మన్ సాయిలు, వివిధ గ్రామాల ముదిరాజ్‌లు తదితరులున్నారు.



బాన్సువాడ మున్సిపాలిటీ శివారు ప్రాంతంలోని సాయికృప నగర్ కాలనీ ఏర్పడి దాదాపు పదిహేనేళ్లు కావస్తోంది. కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడం వల్ల కాలనీవాసులు కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షా కాలంలో మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడం, వేసవిలో దుమ్ము ధూళితో ఆరోగ్య సమస్యలు తలెత్తడం వంటి సమస్యలు నిత్యకృత్యంగా మారాయి.

— అక్షరటుడే, బాన్సువాడ

# పదిహేనేళ్లయినా

# పరిస్థితి మారలే..

▸ బాన్సువాడ సాయికృపనగర్‌లో అధ్వానం

▸ అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులు ▸ కాలనీవాసులకు తప్పని ఇబ్బందులు

పట్టణంలోని సాయికృపకాలనీ ఏర్పడి పదిహేనేళ్లయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఇన్నేళ్లు ఇబ్బందులు పడుతూ వచ్చిన కాలనీవాసులు ఇటీవల తమ సమస్యలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు.

### రూ. 3 కోట్లతో పనులు..

ఇందుకు సంబంధించి గతేడాది టెండర్లు పిలవగా ఓ గుత్తేదారు కాంట్రాక్టును దక్కించుకున్నాడు. సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టేందుకు అధికారికంగా పనులు ప్రారంభమయ్యాయి. అయితే ప్రారంభోత్సాహంతో మొదలైన పనులు మధ్యలోనే నిలిచిపోవడం కాలనీవాసులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. సీసీ రోడ్డు పనులు కొంతవరకు చేసి, అనంతరం కంకర, డస్ట్ వేసి వదిలేయడంతో గత ఆరు నెలలుగా కాలనీ అంతా అస్తవ్యస్తంగా మారింది.

### వాహనాల రాకపోకలకూ ఇబ్బందులే..

వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో పాటు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధంతరంగా నిలిచిన పనుల వల్ల వర్షం పడితే రోడ్లపై నీరు నిలిచి బురదగా మారుతోంది. దీని కారణంగా దోమలు, ఈగలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక కాలనీవాసులు అయోమయ స్థితిలో ఉన్నారు.

### అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను వేగవంతంగా పూర్తి చేసి తమ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అభివృద్ధి పనులు పూర్తి అయితేనే తమ కాలనికి నిజమైన మౌలిక సదుపాయాలు అందినట్లవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## రైతుల సాయుధ పోరాటంలో సీపీఐది ప్రధాన పాత్ర



**అక్షరటుడే, బాన్సువాడ :** రైతుల సాయుధ పోరాటంలో సీపీఐ ప్రధాన పాత్ర పోషించిందని నియోజకవర్గ ఇన్ ఛార్జి దుబాస్ రాములు పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బాన్సువాడ లో వేడుకలు నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలోని సీపీఐ కార్యాలయం లో జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కీలక పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. బ్యాంకుల జాతీయకరణ, దున్నేవాడికి భూమి, కార్మికులకు శ్రమకు తగిన వేతనం, వెట్టి చాకిరి నిర్మూలన వంటి అనేక ప్రజాస్వామ్య ఉద్యమాలు తమ పార్టీ నిర్వహించిందన్నారు. తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం ద్వారా లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘన చరిత్ర సీపీఐదని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు, కార్మిక సంఘాల సభ్యులు నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి డి.శంకర్, రేణుక, సురేఖ, శివాజీ, అడుపల్లి రాజు, వెంకటి, కాశీరాం, రాజు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, వార్డ్ మెంబర్లకు సన్మానం



**అక్షరటుడే, లింగంపేట :** మండల కేంద్రంలోని రామాలయంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇటీవల గెలుపొందిన విశ్వబ్రాహ్మణ సర్పంచ్, వార్డు మెంబర్లను సన్మానించారు. కొర్పోల్ సర్పంచ్ గా ఏగొండ గెలుపొందడంతో ఆయనను సత్కరించారు. ఆయా గ్రామాల్లో పోటీచేసిన అభ్యర్థులకు, వార్డు సభ్యులకు ఆ సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కమ్మరి పండరి, రాష్ట్ర నాయకులు వడ్ల భీమయ్య, రామచందర్, కమ్మరి వెంకటేశం, చంద్రశేఖర్, మురళి, వెంకటి, బ్రహ్మం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.







## గ్రామాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్/మెండోరా/ ఆర్మూర్/ఎల్లారెడ్డి :** గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముప్కాల్, మెండోరా మండలాల్లోని గ్రామాల్లో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని నాగంపేట్ గ్రామం లో 1,653 మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. నాగంపేట్ సర్పంచ్ దాసరి గంగాధర్, ఉపసర్పంచ్ మదన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి ఆర్. ఉజ్వల, గోపాలమిత్ర ప్రణీత్, షకీల్, బషీర్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మి, జీవాల పెంపకదారులు ముత్యం, నవీన్, శ్రీనివాస్, భీమేశ్, మల్లయ్య, దాసు, చిన్న ముత్యం పాల్గొన్నారు. మండలంలోని బుస్సాపూర్ గ్రామం లో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుస్సాపూర్ సర్పంచ్ నూత్‌పల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముర్సూర్ సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ. సాయారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నాగరాజు, వార్డు సభ్యుడు జె.రాజన్న పాల్గొని జీవాలకు మందులు వేశారు. పశువైద్యాధికారి గౌతమ్ రాజు, పశువైద్య సహాయకుడు ప్రవీణ్, ఆఫీస్ సబార్డినేట్ మల్లేష్, జీవాల పెంపకదారులు అంగోల సాయన్న, అంగోల పెద్ద సాయన్న, గుజ్జ నర్సయ్య, మేకల చంద్రబోస్, గుజ్జ మల్లయ్య, మేకల అశోక్ పాల్గొన్నారు. జీవాలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అర్చన రైతులకు సూచించారు. ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాధానాగరాజుతో కలిసి వైద్యురాలు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాను ప్రసాద్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామంలో సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్, వెటర్నరీ వైద్యుడు సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.







## ముప్కాల్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో శుక్రవారం శివశక్తి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ టోర్నమెంట్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కట్ట మహేష్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. గంగాధర్ రెడ్డి, ఏఎస్సై గంగారాం, కొమ్ముల శ్రీనివాస్, ముప్కాల్ ఉపసర్పంచ్ బి. చిన్నయ్య, వార్డు సభ్యుడు దినేష్, శివశక్తి క్లబ్ సభ్యులు అజయ్, నవీన్, రాకేష్, శ్రీను పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

**అక్షరటుడే, లింగంపేట:** మండలం బానాపూర్ తండాలో శుక్రవారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సర్పంచ్ పీర్ సింగ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాలకు నాణ్యమైన చీరలను అందజేసినట్లు పేర్కొన్నారు.



## జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు వివేక్ ఎంపిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** బాక్సింగ్‌లో ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి వివేక్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో బాక్సింగ్ లో గోల్డ్ మెడల్లు సాధించిన వివేక్ తన ప్రతిభతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. చిన్నతనం నుంచి బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడని.. బాక్సింగ్‌డే రోజైన శుక్రవారం మహారాష్ట్ర లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నిఖిల్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్, సీనియర్ ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి, రామ్ కుమార్ విద్యార్థినిని అభినందించారు. విద్యార్థికి శిక్షణ ఇస్తున్నటువంటి అకాడమీ కోచ్ శ్రీకాంత్‌కు వారు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## ఆటో బైక్ ఢీ:ఒకరికి గాయాలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సిర్పూర్‌కు వెళ్లే దారిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం న్యాల్‌కల్ నుంచి సిర్పూర్ గ్రామానికి వెళ్లేదారిలో ఆటో, బైక్ వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న గొల్లపు ఇంద్రయ్యకు ఎడమ కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ఫస్ట్‌ఎయిడ్ చేశారు. అనంతరం అతడిని జీజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు 108 ఈఎంటీ రాములు, పైలట్ అజయ్‌ను అభినందించారు.